క్లుప్తంగా

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

ఖమ్మంఅర్బన్: మానవాళి అంతటికీ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్ కొమనపల్లి బెంజిమెన్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలో మహాసేన ఖమ్మం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన దైవజనుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదవారికి విద్యా, ఆర్థికపరంగా అండగా నిలిచేలా ఏసుక్రీస్తు బాటలో నడవాలన్నారు. ఈ సదస్సులో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బ్రదర్ మంద సంజీవరావు, ఎస్టీ సెల్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దానియేలు బోడా, బీసీ సెల్ అధ్యక్షుడు కూరపాటి శామ్యూల్, మీటింగ్ కార్యనిర్వాహకులు మోజేష్ వర్నిల్, భాస్కర్, జాన్, కాంతారావు, తెల్లారిపల్లి రమేష్, పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు శామ్యూల్ పిన్ని,త్యాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని 18, 26 డివిజన్‌లతో పాటు వీవీపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ తెలంగాణలో అమలు చేయకపోవటం విచారకరమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, సైదులు, నరేష్, వెంకట్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల ఖమ్మం నుంచి ఉమ్రా వెళ్లిన యాత్రికులు గురువారం ఖమ్మం చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఇక్కడి ముస్లిం పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఈమేరకు టూర్ అండ్ ట్రావెల్స్ హఫీజ్ జవ్వాద్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హఫీజ్ జవ్వాద్ అహ్మద్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బాగుండాలని ప్రతి ఒక్కరూ నమాజు ఆచరిస్తూ, దాన ధర్మాలు చేస్తూ, మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో పయనిస్తారని మక్కా మునవరా, మదీనాలో ప్రతిజ్ఞ చేసినట్లు తెలిపారు.

రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

కూసుమంచి: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు తక్షణమే రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నర్సింహా డిమాండ్ చేశారు. గురువారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో రుణమాఫీ రూ.90వేల వరకే ప్రకటించిందని, దానివల్ల రైతులు నష్టపోతారని అన్నారు. మాట తప్పకుండా లక్ష రుణమాఫీ అమలు చేయాల్సిందేనని, పేదలకు ఇళ్లు, గిరిజన బంధు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు భూక్యా శ్రీకాంత్, శ్రీను, నాను తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని మంగ్రాజుపల్లిలో గురువారం కంటి వెలుగు కేంద్రాన్ని చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్ ప్రారంభించారు. కేంద్రాలకు వచ్చే ప్రతీ ఒక్కరికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, సర్పంచ్ నెల్లూరి అనురాధ, కంటి వెలుగు వైద్యాధికారి కె.రాధాకృష్ణ, పీహెచ్ఎస్ కె.వాణి, గ్రామ పెద్దలు వజ్జా శ్రీనివాసరావు, తోళ్ల బుచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఖమ్మం సహకారనగర్: మోదీ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలైన సీబీఐ, సెబీ విచారణ చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రైవేట్ పరం చేస్తుంటే కేంద్ర నిఘా సంస్థలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అదానీ ఆస్తుల కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీసీసీ సభ్యులు, పార్టీ నగర అధ్యక్షులు మహమ్మద్ జావీద్, రాయల నాగేశ్వరరావు, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, పల్ల బోయిన భారతిచంద్రం, సైదులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	వినరో భాగ్యం విష్ణు కథ
సాయిరాం	కోనసీమ తగ్స్
ఆదిత్య	సెల్ఫీ
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	మిరపకాయ్

- ఖమ్మంవ్యవసాయం

ముంచుకొస్తున్న ముహూర్తం!

సీసీ రోడ్ల నిర్మాణాలకు మరో 35 రోజులే గడువు

- ఇంకా ప్రతిపాదనలతోనే సరి
- పురోగతి లేని రహదారుల పనులు..
- ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు
- సకాలంలో పూర్తి కాకపోతే నిధులు వెనక్కి
- ఆందోళన చెందుతున్న ప్రజలు



సీసీ రహదారి వేయాల్సిన నేలకొండపల్లి మండలంలోని గ్రామీణ రహదారి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే పనులు ప్రతిపాదనలతోనే ఉన్నాయి. గ్రామ పంచాయతీ భవనాలు, సిమెంట్ రహదారుల నిర్మాణాలకు గడువు ముంచుకొస్తుంది. చాలా చోట్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. సకాలంలో పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉండటంతో పాలేరు నియోజకవర్గం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పనులకు మరో 35 రోజులే గడువు ఉండటంతో పనులు పూర్తవుతాయో లేదో అనేది ప్రశ్నార్థకంగా మారింది. డివిజన్ వ్యాప్తంగా పనులు ఇంకా చాలా చోట్ల చేపట్టాల్సి ఉంది.

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో 2022–23 ఏడాదికి ఉపాధి హామీ పథకం కింద గ్రామ పంచాయతీ భవనాలు మంజూరైనప్పటికీ చాలా చోట్ల పంచాయతీ భవనాలు ప్రారంభించలేదు. తాజాగా నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు రూ.227 లక్షలు, తిరుమలాయపాలెం మండలానికి రూ.271 లక్షలు, కూసుమంచి మండలానికి రూ.281 లక్షలు, ఖమ్మం రూరల్ మండలానికి రూ.336 లక్షల విలువైన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అధికారికంగా తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ప్రతిపాదనలతోనే నిలిచిపోవటంతో అధికారులు పనులు ప్రారంభం చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పనులన్నీ మార్చి ముగిసే లోపు పూర్తి చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తే అప్పటి వరకు అయ్యే పరిస్థితి కనిపించటం లేదు.

ముందుకు రానీ కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు..

గతేడాది చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా చాలా వరకు పెండింగ్ ఉండటంతో ఈ పనులు చేసేందుకు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. పనులు మాత్రమే మంజూరు అయ్యాయని, ఇంకా అధికారిక ఉత్తర్వులు రాలేదని తెలుస్తోంది. కాగా, పెరిగిన సిమెంట్, ఇసుక ధరలు, రూ.లక్షలు అప్పులు తెచ్చి పనులు చేస్తే బిల్లులు సకాలంలో వస్తాయా లేదా అనే సందేహాలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. పలు చోట్ల భరోసా ఇస్తున్నా.. కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని తెలుస్తోంది. పంచాయతీ భవనాల నిర్మాణంలో ఎలాంటి పురోగతి కనిపించటం లేదు. గడువు లోపే ఎలా పూర్తి చేస్తారో వేచి చూడాల్సిందే మరి.

హడావుడిగా పనులు చేపట్టొద్దు..



గడువు ముగుస్తుందని సంబంధిత కాంట్రాక్టర్లు హడావుడిగా పనులు చేపట్టకుండా.. ముందుగానే పనులు చేపట్టాలి. పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలంటే ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. తక్షణమే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు చేపట్టాలి.

– పి.శ్రీనివాస్, ఆర్టీఐ కార్యకర్త, నేలకొండపల్లి

మరిన్ని నిధులు కేటాయించాలి..



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులతో పాటు అత్యవసర పనులకు ఇతర నిధులనుంచి అయినా మరిన్ని నిధులు కేటాయించాలి. గ్రామంలో అన్ని రోడ్లను సీసీ రహదారులుగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. పాలకులు అర్థం చేసుకుని ప్రత్యేక నిధులు కేటాయించాలి.

– దొనకొండ రామకృష్ణ, సర్పంచ్, ఆరెగూడెం

ఆదేశాలు రాగానే చేపడతాం...



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఈ ఏడాది పనులకు సంబంధించి ఉత్తర్వులు అందలేదు. రాగానే శరవేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. మొత్తానికి మంజూరైన నిధులన్నింటినీ ఆర్థిక సంవత్సరం ముగిపులోగా పూర్తి చేయిస్తాం.

– శ్రీనివాస్, ఏఈ, పంచాయతీరాజ్, నేలకొండపల్లి

‘ఉపాధి’కి ఈ–కేవైసీ తప్పనిసరి



ఆధార్ అనుసంధానం చేయిస్తున్న ఏపీఓ సునీత

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఈజీఎస్ ఏపీఓ సునీత సూచించారు. మండలంలోని ఆచార్లగూడెంలో గురువారం ఉపాధి కూలీల ఆధార్ కార్డు అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు 1,000 మందికి సాంకేతిక సమస్యల వల్ల జాబ్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం కావడంలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ–కేవైసీ చేయించుకుని ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేగూరి శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్‌కుమార్, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రియదర్శిని’లో విద్యార్థినులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి సయోజ్

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో గురువారం టాస్క్ ఆధ్వర్యాన మెంటూర్ టుగెదర్ సంస్థచే ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రాంపై గురువారం విద్యార్థినులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సయోజ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉద్యోగ సాధనకు నేర్చుకోవాల్సిన మెళకువలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థ నిర్వహించిన మూల్యాంకన పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థినులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె. నవీన్‌బాబు, విజయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో అంగన్‌వాడీలు కళకళలాడాలి

రఘునాథపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతను పాటిస్తూ చిన్నారుల హాజరు శాతం పెంచి కళకళలాడేలా చూడాలని సీడీపీఓ కవిత తెలిపారు. గురువారం రఘునాథపాలెం రైతు వేదికలో ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీల ఆయాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పని చేస్తున్న వారు, కొత్తగా నియమించబడిన ఆయాలకు విధులు, నిధులు, నిర్వహణ వంటి వాటిపై సమీక్ష సమావేశంలో ప్రాంతాల వారీగా సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆహార విషయంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భిణులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమన్వయంతో కేంద్రాలను సక్రమంగా కొనసాగించేలా చూడాలని, ఏమైనా ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్లు క్రిష్ణకుమారి, విజయకుమారి, రాధిక, సత్యశీల, సునీత, సత్యావతి, కోటేశ్వరి, సుధా, భవాని, పుష్పలత, శ్రీలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధించిన వారిని కఠినంగా శిక్షించాలి

ఖమ్మంమయూరిసెంటర్: పీజీ వైద్య విద్యార్థిని ప్రీతిని లైంగికంగా వేధించి ఆత్మహత్యాయత్నానికి కారుకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కేయూ పీజీ యూనివర్సిటీ సబ్ క్యాంపస్ ఎదుట వీసీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలు పోసే వైద్య విద్యార్థులకు ప్రాణరక్షణ లేకుండా పోయిందన్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయకార్యదర్శి సతీష్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, కరుణ్, పృథ్వీ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే బాబా జీవితం స్ఫూర్తిదాయకం

నేలకొండపల్లి: అణగారిన కులాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని బీసీడీఎఫ్ జిల్లా కార్యదర్శి పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త గాడ్గే బాబా జయంతి సందర్భంగా గురువారం మండలంలోని కొత్తకొత్తూరులో సేవా కార్యక్రమం నిర్వహించారు. తొలుత గాడ్గే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సంత్ గాడ్గే బాబా జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీడీఎఫ్ పాలేరు డివిజన్ కార్యదర్శి దేవరశెట్టి రాము, మండల కన్వీనర్ తొగటి నాగాచారి, నాగరాజు, పుసులేటి శివ, పి.ఉదయ్‌కుమార్, డి.శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు క్షీరాధివాసం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని విజయనగర్ కాలనీ శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సిద్ధి వినాయక, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఉదయం నుంచి మంగళ వాయిద్యాలు, వేద పారాయణం, దిక్పాల హోమంతో పాటు దేవత, దీక్ష హోమాలు, క్షీరాధివాస కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అర్చనశాల, బలిహరణ, సాయంకాలం పుష్పాది వాసం, శయ్యాదివాసం, ఆదివాసంగా వాహనం, కళా హోమాలు, నిద్ర కలశస్థాపన, బలిహరణలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మందిరం చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య సిద్ధాంతి, వైస్ చైర్మన్ బుద్ధ రామకృష్ణ, సెక్రటరీ పెంట్యాల వెంకటనరసయ్య, జాయింట్ సెక్రటరీ చంద్ర వీరభద్రరావు, సభ్యులు మండెపూడి కృష్ణయ్య, దొడ్డ నరసింహారావు, భూక్యా భిక్షపతి, కార్పొరేటర్ పైడపల్లి రోహిణిసత్యనారాయణ, మురళీ కృష్ణ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

కామేపల్లి (కారేపల్లి) : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సులభమని, ప్రస్తుత రోజుల్లో వీటి వినియోగం తప్పనిసరి అని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. కామేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అజ్మీరా రాందాస్ నాయక్ అధ్యక్షతన గురువారం కామేపల్లి పోలీసులు సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామపెద్దలు ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా పది మంది సభ్యులతో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటు కమిటీని నియమించారు. కమిటీ సభ్యులుగా అంతోటి అచ్చయ్య, మహంకాళి రామనర్సయ్య, భూక్యా శ్రీను, జల్లి రాములు, రాయల లక్ష్మీనారాయణ, జానయ్య, నర్సింహారావు, ఎర్రా తిరుపతి, షేక్ జాకీర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పెండ్ర అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టార్టర్లు తొలగిస్తే ఊరుకోం..



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు ప్రక్రియను వెంటనే నిలిపి వేయకపోతే ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మండడి ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం మండలంలోని సుబ్లేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపుని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం విద్యుత్ కోతలు విధించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించేందుకు విద్యుత్ అధికారులు రైతుల పొలాలకు వెళ్తే రైతులు బాధతో అధికారులపై తిరగబడే పరిస్థితి ఉందని ఈ నిర్ణయాన్ని అధికారులు విరమించుకోవాలని కోరారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వనవాసం జైపాల్‌రెడ్డి, తంగెళ్ల రమేష్, భూక్యా భిక్షం, రవి, మెట్టు తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీకి తరలిన కాంగ్రెస్ నాయకులు



ఖమ్మంరూరల్: పెదతండా నుంచి ప్లీనరీకి తరలి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఖమ్మం సహకారనగర్/ ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరి సమావేశాలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ నగరంలో ఈ నెల 24, 25, 26వ తేదీల్లో జరగనున్న నేపథ్యంలో జిల్లా నాయకులు గురువారం తరలివెళ్లారు. ఏఐసీసీ, పీసీసీ డెలిగేట్స్ రేణుకా చౌదరి, భట్టి విక్రమార్కలకు అందిన ఆహ్వానాల మేరకు ఖమ్మం నగరం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావీద్, సంభాని చంద్రశేఖర్, రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, వడ్డె నారాయణరావు, రాందాస్ నాయక్, శీలం ప్రతాపరెడ్డి తదితరులు తరలివెళ్లారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలం పెదతండా సెంటర్‌లో నాయకులు ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ వైరా ఇన్‌చార్జ్ ధరావత్ రామ్మూర్తినాయక్ ఆధ్వర్యంలో నాయకులు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో నాగండ్ల శ్రీనివాసరావు, కార్పొరేటర్ రజియా, పి.లెనిన్, ఎండీ.ముస్తఫా రాములు తదితరులున్నారు.

‘ఎస్‌బీఐటీ’లో నాయకత్వ లక్షణాలపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం సహకారనగర్: యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని మేయర్ పునుకొల్లు నీరజ, ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణలు సూచించారు. గురువారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) ఆధ్వర్యంలో యువత నాయకత్వ లక్షణాలు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అనే అంశంపై జిల్లా కో ఆర్డినేటర్ చింతల అన్వేష్ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తొలుత మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణకార్యక్రమాలను వినియోగించుకొని భవిష్యత్‌లో పార్లమెంట్, అసెంబ్లీలలో మాట్లాడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఐ.వి.రమణారావు, స్థానిక కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంత లక్ష్మి, ఎన్‌వైకే బాధ్యులు మోహనకృష్ణ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జి.సుభాష్ చందర్, జె. రవీందర్ బాబు, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి ‘కందాల’ చేయూత



రఘునాథపాలెం: ఆర్థిక సాయమందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి విజయమ్మ

రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: రఘునాథపాలెం మండలంలోని కామంచికల్ పంచాయతీ పాటివారిగూడెంలో చర్చి అభివృద్ధి కోసం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అందించిన రూ.50వేలను గురువారం ఆయన సతీమణి విజయమ్మ నిర్వాహకులకు అందించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలకు ఆర్థిక సాయమందించారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు, పిండిప్రోలు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన 12 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు..

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు పువ్వాడ ఫౌండేషన్ ద్వారా గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, సర్పంచ్ అరుణతో పాటు నాయకులు రవికిరణ్, రామ, చందర్‌రాథోడ్, శ్రీను, దేవా, ధరావత్ మోతీలాల్, భూక్యా బిక్కు, ఈరు, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి..

కూసుమంచి: కూసుమంచికి చెందిన పసల అకమంచమ్మ గత కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితం కావటంతో కుటుంబం గడవటం ఇబ్బందిగా మారింది. దీంతో గురువారం పలువురు ఆదుకునేందుకు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బారి వీరభద్రం యాదవ్, రాజుపేటకు చెందిన కొర్రా మహేష్‌లు గురువారం ఆ కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ.3వేల నగదు అందించి ఔదార్యం చాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నా మోహన్‌రావు, వార్డు సభ్యుడు తంగెళ్ల చంద్రయ్య, గ్రామస్తులు మజీద్, మహిపాల్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అధ్యాపక బృందం..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని మధుప్రియ వెన్నుముఖకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం పాఠశాల హెచ్ఎం కోటేశ్వరమ్మతో పాటు ఉపాధ్యాయులు కలిసి సేకరించిన మొత్తం రూ.10 వేలను విద్యార్థినికి గురువారం అందించారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి




వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

రఘునాథపాలెం: గత నాలుగు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిన పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే అందించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. గురువారం ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రఘునాథపాలెం ఎంపీడీఓని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు రాకపోగా.. జీతాలు కూడా సక్రమంగా ఇవ్వకపోవడం చూస్తుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ అన్న చందంగా ఉందన్నారు. కలెక్టర్, మంత్రి జోక్యం చేసుకొని పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించేలా చూడాలని కోరారు. మంత్రి మండలంలో ఈ దుస్థితి ఉంటే జిల్లా వ్యాప్తంగా కార్మికుల పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి అధికారులు అర్థం చేసుకోవాలని తెలిపారు. సకాలంలో పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించకుంటే యూనియన్ తరఫున పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల శ్రీనివాస్, తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా నాయకులు నారాయణ, రవి, నరేష్, బీమా, ప్రసాద్, సైదులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అసలే ఇరుకు.. ఆపై గుంత



నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలో శ్రీభక్తాంజనేయస్వామి దేవాయం వద్ద రేషన్ దుకాణంవైపు వెళ్తున్న రోడ్డు, జంక్షన్ ఇరుకుగా ఉంటుంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతుంటారు. దీనికి తోడు జంక్షన్‌కు వెళ్లే మలుపులో పెద్ద గుంత ఏర్పడి అందులో మురుగునీరు నిలవడంతో మరింత అవస్థలు పడాల్సి వస్తోంది. రాత్రి వేళ ప్రమాదాలు నిత్యకృత్యమైనందున అధికారులు గుంత పూడ్చించడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. - ఖమ్మం అర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : కుమార్, ఏఈ, కార్పొరేషన్

సెల్ నంబర్ : 94412 25169